క్లుప్తంగా

విద్యుత్ మీటర్ రీడర్స్ వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ శాఖ మీటర్ రీడర్స్‌కు పని దినాలు అమలు చేయాలని, ఎస్కో ఎకౌంటు ఓపెన్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ మీటర్ రీడర్స్ యూనియన్ శుక్రవారం ఏపీ ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. మార్చి ఒకటి నుంచి మీటర్ రీడర్స్‌కి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓటు వేద్దాం - ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై ఏర్పాటుచేసిన కళాజాత కార్యక్రమానికి లక్ష్మణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సత్ప్రవర్తన, సుపరిపాలనకు, అభివృద్ధికి తోడ్పడే వారిని గెలిపించాలని సూచించారు. సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలకమండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ డబ్బులు, మద్యం, కులం, మతం, ప్రాంతాలకతీతంగా ఓటు వేసి మంచివారిని చట్టసభలకు ఎన్నుకోవాలని అన్నారు. 12 మంది కళాకారుల బృందం ఓటర్లను చైతన్య పరిచే గేయాలు, జానపదాలు, నృత్య నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రంగం ప్రజా సాంస్కృతిక వేదిక కన్వీనర్ ఆర్ రాజేష్ , ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎ.ఏసుబాబు తదితరులు మాట్లాడారు.

జబర్దస్త్ బృందానికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): జబర్దస్త్ సినీ కళాకారుల బృందానికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఒక రాజకీయ పార్టీ తరఫున 25 రోజుల్లో 100 ప్రదర్శనలు ఇవ్వడం దేశంలో మొదటిసారని ఆ సంస్థ పేర్కొంది. గురువారం రాత్రి ఏలూరు సుంకరవారి తోటలో నిర్వహించిన 102వ ప్రదర్శనను సంస్థ ప్రతినిధులు పరిశీలించి, రికార్డును నమోదు చేసినట్టు సంస్థ ప్రతినిధి, సుప్రీంకోర్టు న్యాయ వాది వరప్రసాద్ ప్రకటించారు. ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, ఇమ్మానియేల్, అప్పారావు, వినోద్, బాబి, సినీ గాయనీగాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య తదితరులకు శుక్రవారం అవార్డు, మెడల్స్‌ను సంస్థ ప్రతినిధులు అందజేశారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలపై బీజేపీ నేత జీఎస్ఆర్ చౌదరి తరఫున వారు ఈ ప్రదర్శనలు నిర్వహించారు.

ఏలూరులో ఆస్తిపన్నుపై బంపర్ ఆఫర్

- చెల్లింపుదారులకు వడ్డీ మాఫీ
- వారికి రూ.12 కోట్ల లబ్ధి
- చెల్లించినవారికీ ఆఫర్ వర్తింపు



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్నులు చెల్లింపుదారులకు ఆర్థిక ప్రయోజనం కలిగించేలా మరోసారి వడ్డీ మాఫీ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగర ప్రజలకు గత ఆర్థిక సంవత్సరం ముగింపులోనూ వడ్డీమాఫీ ప్రకటించిన ప్రభుత్వం, ఈ ఆర్థిక సంవత్సరం 2023-24లోనూ ఆఫర్ ఇచ్చింది.

31లోగా చెల్లించాలి

మార్చి 31లోగా ఆస్తి పన్ను చెల్లింపులు చేసిన వారికి పన్నుల్లో ఇప్పటివరకూ ఉన్న వడ్డీలను మాఫీ చేస్తారు. ఆస్తి పన్ను చెల్లింపునకు ఏలూరు కార్పొరేషన్ రెవెన్యూ విభాగం వద్ద ప్రత్యేకంగా కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లోనూ చెల్లించేలా ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు.

రూ.12 కోట్ల ప్రయోజనం

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారుగా రూ.36,25,86,751లు పన్నుల రూపంలో వసూలు చేయాల్సింది. ఈ ఏడాదిలో ప్రస్తుతం రూ.1 కోటికిపైగా వసూలు చేయగా మిగిలిన పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రభుత్వం వడ్డీమాఫీ చేయటంతో ప్రజలకు ఈ ఏడాది ఏకంగా రూ.12.89 కోట్లు మేర ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. ఇక ఈ ఏడాది పన్నుల రూపంలో రూ.23.36 కోట్లు మేర వసూలు చేయాల్సింది.

చెల్లించిన వారికీ వడ్డీమాఫీ

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన వారికీ మేలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆస్తి పన్నులు చెల్లించిన వారికి ప్రత్యేకంగా వారు చెల్లించిన పన్నుల్లో వడ్డీని లెక్కగట్టి వచ్చే ఏడాది పన్నుల్లో దాన్ని చేర్చేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం వడ్డీమాఫీ ప్రకటించటం పట్ల పన్ను చెల్లింపుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఆర్థిక లబ్ధి



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపుదారులకు ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనం కల్పిస్తూ జీవోఎంఎస్ 35ను ఫిబ్రవరి 29న విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు ఏలూరు నగరంలో వడ్డీమాఫీతో ప్రజలకు సుమారు రూ.12 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ప్రజలు ఆన్‌లైన్‌లోనూ పన్నుల చెల్లించే అవకాశం ఉంది. అదేవిధంగా కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం వద్ద ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

ఆత్మీయ కలయిక



పామర్రులో సీఎం జగన్‌ను కలిసిన సొంగా సందీప్

ఏలూరు (టూటౌన్): జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం కృష్ణాజిల్లా పామర్రు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌ను లిడ్ క్యాప్ డైరెక్టర్, పార్టీ చింతలపూడి నియోజకవర్గ నాయకులు సొంగా సందీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. చింతలపూడి నియోజకవర్గ పరిస్థితులను సీఎం జగన్ తనను అడిగి తెలుసుకున్నారని, పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారని సందీప్ తెలిపారు.

దాడికి ఖండన

జంగారెడ్డిగూడెం రూరల్: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై టీడీపీకి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడటాన్ని జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఒక ప్రకటనలో ఖండించారు.

4 నుంచి నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ (ఆంధ్రా బ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్ (టైలరింగ్)లో యువతులకు 30 రోజులు, కంప్యూటర్ ట్యాలీ, ఎమ్మెస్ ఆఫీస్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుకు దరఖాస్తు చేసుకునే యువతులు కనీసం ఐదో తరగతి చదివి ఉండాలని, కంప్యూటర్ ట్యాలీ, ఎమ్మెస్ ఆఫీస్ కోర్సుకు 10వ తరగతి, ఆపైన విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. ఈ రెండు కోర్సులు ఈ నెల 4 నుంచి ప్రారంభమౌతాయని వివరించారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 99485 65256, 95027 23561లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రచార కన్వీనర్ల నియామకం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ కొయ్యలగూడెం మండల ప్రచార కన్వీనర్లను నియమించినట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ తోట జయబాబు (సీతంపేట), మందపాటి రామకృష్ణ (సరిపల్లి), పసుపులేటి రాంబాబు (పొంగుటూరు సర్పంచ్), తేలే శ్రీను (మంగపతిదేవిపేట ఎంపీటీసీ), కట్టా రాము (కొయ్యలగూడెం), సొంగా రాకేష్ (కన్నాపురం)లను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సూచన మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్ల నాని నియమించినట్టు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు చేశారు. ఉదయం మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఉదయం నగరంలోని దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రం ఆధ్వర్యంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం రిటైర్డ్ లెక్చరర్ కోటమర్తి బ్రహ్మేశ్వరి శ్రీమద్ భగవద్గీత ద్వాదశోధ్యాయం - భక్తి యోగం అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి నగరానికి చెందిన శ్రీ రామాంజనేయ నాట్య మండలి ఆధ్వర్యంలో శ్రీ రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటక ప్రదర్శన చేశారు.

ఎస్సీ వర్గీకరణను ఆపలేరు



బాబూజగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ ఆపలేరని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు అన్నారు. స్థానిక ఫ్లైఓవర్ సమీపంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమర వీరులను స్మరించుకోవడం అందరి బాధ్యతగా గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకునే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాశీ కృష్ణ, ఎస్ లక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పుష్పాభిషేకం



కొత్తపేట ప్రాంతంలో జగన్ చిత్రపటానికి పూలాభిషేకం చేస్తోన్న వృద్ధులు



43వ డివిజన్‌లో వలంటీర్ జ్యోత్స్నను సత్కరిస్తున్న వృద్ధులు, పెన్షన్‌దారులు

ఏలూరు టౌన్: కుటుంబానికి పెద్దకొడుకు.. మనవడు జగన్‌బాబు తమను ఆదుకుంటూ.. ప్రతినెలా 1వ తేదీన తెల్లవారుజామునే తమ ఇంటికే పెన్షన్ పంపిస్తూ.. తమ జీవనానికి భరోసా కల్పిస్తున్నాడని వృద్ధులు, పింఛను లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ చిత్రపటానికి పూలాభిషేకం చేసి తమ ప్రేమను ప్రదర్శించారు. కొత్తపేట 43వ డివిజన్ భావిశెట్టివారి వీధిలో మహిళలు, వృద్ధులు సీఎం జగన్ చిత్రపటానికి పూలు జల్లుతూ ఆయనపై తమకు ఉన్న అభిమానం చూపించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో ఏలూరులోని ప్రతి పేదవానికీ మేలు చేకురుతోందని సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్ జ్యోత్స్నను ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది బెస్ట్ వలంటీర్‌గా అవార్డు సొంతం చేసుకున్న జ్యోత్స్నకు వైఎస్సార్ సీపీ నాయకులు లంకలపల్లి లక్ష్మి, కోహిమా, అల్లం రాధ, మహిళలు, వృద్ధులు పూలదండలు వేసి అభినందించారు. ఈ సందర్భంగా గృహసారథి గొంతిన రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్, సచివాలయ వ్యవస్థను అమలు చేస్తూ ప్రజలకు పాలనను చేరువ చేశారని గుర్తుచేశారు. కులం, మతం, రాజకీయ పార్టీల తారతమ్యం లేకుండా ప్రతి అర్హునికీ ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇలా.. అన్ని వర్గాలు సీఎం జగన్‌ను తమ కుటుంబ సభ్యునిలా భావిస్తున్నారని తెలిపారు. వృద్ధుల దీవెనలు సీఎం జగనన్నకు ఎప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోలా భాస్కరరావు, సృజన కుమార్, గొంతిన ఝాన్సీలక్ష్మి, బద్దిరెడ్డి సత్యవతి, నక్క చిలకమ్మ, సురాబత్తుల గొయ్యమ్మ, పాతాళ రవణమ్మ, బండి అరుణ, కరణం పద్మ, జలపారి చిన్నమ్మడు ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై అధికారుల పరిశీలన

దెందులూరు: దెందులూరు పంచాయతీలో రూ. కోటి పైగా నిధుల దుర్వినియోగం అంశంపై కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ పరిశీలన నిమిత్తం ప్రస్తుత గ్రామ కార్యదర్శి, పూర్వపు గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌లను హాజరుకావాలని సూచించారు. గ్రామానికి చెందిన చిలికి శేఖర్ పంచాయతీలో రూ.కోటికి పైగా నిధులు దుర్వినియోగమయ్యాయని జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో డీపీఓ, డీఎల్‌పీఓ చేసిన విచారణ చేసి నిధుల దుర్వినియోగమయ్యాయని నిర్ధారించారు. ఇటీవల దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ చెక్‌పవర్‌ను రద్దు చేశారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ కార్యాలయంలో రికార్డులు, స్టేట్‌మెంట్లు, రశీదులను అధికారులు పరిశీలించనున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	72
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	44
కాకర కాయలు	40-44	కీరా దోస	30
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	74
కాలీఫ్లవర్	30	అల్లం	120
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	36-44	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



సంక్షేమ దివస్‌లో సమస్యలు వింటున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని పోలీస్‌శాఖలో పని చేస్తోన్న సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని పోలీస్, ఏఆర్, హోంగార్డ్ సిబ్బంది నేరుగా జిల్లా ఎస్పీకి తమ సమస్యలను చెప్పుకున్నారు. సిబ్బంది వినతులను పరిశీలించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సిబ్బందికి విధుల్లో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరిస్తూ.. ప్రజలకు సిబ్బంది ఉత్తమ సేవలు అందించేందుకు తమవంతు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి తాడేపల్లిగూడెంకు చెందిన సీహెచ్‌వీడీ రాజేష్ శుక్రవారం రూ.2,00,101 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. తొలుత రాజేష్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు.

టీడీపీ సాధికార మిత్ర చేతివాటం



మలకచర్లలో టీడీపీ సాధికార మిత్ర చేసిన మోసాలకు సంబంధించి ఆధారాలు చూపుతున్న బాధిత కుటుంబం

దెందులూరు: దెందులూరు మండలం మలకచర్లలో టీడీపీ సాధికార మిత్ర గొట్టాపు సాయికృష్ణ మోసాలు ఒక్కొక్కటి ఆధారాలతో వెలుగు చూస్తున్నాయి. శుక్రవారం బాధిత కుటుంబం చోడవరపు వెంకటలక్ష్మి, కుమారుడు వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని వెంకట్రాజు, నరేంద్ర బాబ్జి తదితరులు సాయికృష్ణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ సాధికార మిత్ర భీమడోలు ఎస్‌బీఐ నుంచి విత్‌డ్రా చేసిన సొమ్ము వివరాల ఆధారాలను చూపించారు. వెంకటలక్ష్మికి భీమడోలు ఎస్‌బీఐలో అకౌంట్ ఉంది. ఆమె అకౌంట్ నంబర్‌కు ఫోన్ నంబర్ లింక్ అయింది. ఆ అకౌంట్‌లో గత నెల 5న జగనన్న ఇంటి పట్టాపై ప్రైవేటు ఫైనాన్స్ నుంచి మంజూరైన రుణం రూ.2.90 లక్షలు జమైంది. విషయం తెలుసుకున్న టీడీపీ సాధికార మిత్ర సాయికృష్ణ వచ్చి రుణం మంజూరుకు అని మాయమాటలు చెప్పి వెంకట లక్ష్మి ఫోన్‌ను, బ్యాంకు పాసుపుస్తకం, ఏటీఎం, జగనన్న స్థలం పట్టాను తీసుకున్నాడు. అనంతరం విడతలుగా ఆమె ఖాతాలోని రూ.2.90 లక్షలు విత్‌డ్రా చేసి ఇతర ఖాతాలకు బదిలీ చేశాడు. రుణం అందించిన ప్రైవేటు ఫైనాన్స్ సిబ్బంది నాగరాజు తదితరులు వెంకటలక్ష్మి ఇంటికి వచ్చి రుణం మంజూరైందని ఎస్‌బీఐ ఖాతాకు జమ చేశామని చెప్పారు. ఆమె బ్యాంకు అకౌంట్ తనిఖీ చేయగా గత నెల 5 నుంచి రూ. 2.90 లక్షలు ఇతర ఖాతాలకు బదిలీ చేసి ఉంది. విషయం తెలుసుకున్న బాధితురాలు అవాక్కై, సాయికృష్ణను నిలదీసింది. సాయికృష్ణ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడంతోపాటు పంచాయతీ నుంచి కుళాయి నీరు రాకుండా అడ్డుకుంటున్నాడని బాధితురాలు వెంకటలక్ష్మి కన్నీటి పర్యంతమైంది. రుణం రూ. 2.90 లక్షలతోపాటు తమ ఉపాధి కూలీ వేతనం రూ.15 వేలు కూడా డ్రా చేశాడని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ఫిర్యాదు చేస్తాం

మలకచర్లలో టీడీపీ సాధికారమిత్ర గొట్టాపు సాయికృష్ణ గతంలో ఫోన్ డేటా, ఓటీపీ చౌర్యం చేశాడని వెంకటలక్ష్మి అకౌంట్‌లో రుణం డబ్బు, ఉపాధి కూలీ సొమ్ము డ్రా చేసి మోసం చేశాడని వైఎస్సార్ సీపీ నేతలు పర్వతనేని వెంకట్రాజు, నరేంద్ర, బాబ్జి, పేరం ప్రసాద్, పుల్లా శివప్రసాద్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు అన్నారు. బ్యాంకు పాసు పుస్తకం, ఫోన్ పే వివరాలు, ఏటీఎం కార్డు తదితర వివరాలు చూపించి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ న్యాయం జరిగే వరకూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.